క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం ఆవాస గ్రామం మిట్టగూడెం గ్రామానికి చెందిన ఉల్లెందుల రాజేష్ అనారోగ్యంతో మంచం పట్టాడు. అతని తో పాటు 2009- 2012 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడని తెలిసి స్నేహితులందరూ కలిసి రూ.31,500 ఆర్థికసాయం, 50 కేజీల బియ్యాన్ని బుధవారం రాజేష్‌కు అందజేశారు. పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మహిళా రైతులు 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024- 25 ఏడాదికి గాను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మందు పిచికారీ చేసే బ్యాటరీ పంపులు- 5, పవర్ స్ప్రేయర్లు జనరల్- 5, ఎస్సీకి -1, రోటోవేటర్లు- 2, సీడ్, ఫర్టిలైజర్ డ్రిల్- 1, ట్రాక్టర్‌తో నడిపే పనిముట్లు జనరల్- 3, ఎస్సీకి -1 మంజూరైనట్లు తెలిపారు. కావాలిసిన మహిళా రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ రిజిస్ట్రేషన్, రెండు పాస్ ఫొటోలు, దరఖాస్తు ఫారంతో క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అంజన్‌రెడ్డి

గరిడేపల్లి : మండలంలోని కుత్బుషాపురం గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ కటికం రమేష్, ఆకుల కృష్ణయ్య, ఆరెపూడి నారాయణ, బెల్లంకొండ శేఖర్, అరవింద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్

కోదాడరూరల్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. బుధవారం కోదాడ పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం పక్కన గల ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఆటోలు, మినీ టాటా ఏస్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అతివేగంగా వాహనాలను నడపొద్దని తెలిపారు. ఏఎస్‌ఐ ఖయ్యూం, సిబ్బంది ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హుజూర్‌నగర్‌రూరల్ : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట నుంచి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామం వద్ద పోలీస్ సిబ్బంది పట్టుకొని సీజ్ చేశారు. డ్రైవర్ గుజ్జు మోహన్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రెయినేజీ ఆక్రమణ.. అధికారుల పరిశీలన



ఆక్రమణకు గురైన డ్రెయినేజీని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం రహదారిలో మురుగు కాలువను కొందరు ఆక్రమించి దానిపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారడంతో బుధవారం తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పరిశీలించారు. ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ.. మురుగు కాలువపై ఆక్రమణలు తొలగించాలని అక్రమణదారులను హెచ్చరించారు.

ఆలయంలో చోరీ

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామ శివారులో గల చిన్న గట్టు (లింగమంతులస్వామి) దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ చైర్మన్ మద్దుల కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. గట్టుపై ఉన్న లింగమంతులస్వామి దేవాలయంలో సుమారు రూ.20 వేల విలువ గల 30 గంటలతో పాటు హుండీని పగులగొట్టి అందులోని నగదును దుండగులు దోచుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరూ..

- గత పక్షం రోజులుగా కొనసాగుతున్న వరి కోతలు
- దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్న రైతులు



బరాఖత్‌గూడెం శివారులో రైతులు ఆరబోసిన ధాన్యం

మునగాల : సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. మునగాల మండలంలో ఇప్పటికే దాదాపు 20 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వాతావరణంలో మార్పులతో ఇప్పటికే పంట కోసి ధాన్యం ఆరబోసిన వారితో పాటు వరి కోస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. పైరు కోసిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, మండల వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 21,586 ఎకరాల్లో వరిసాగు చేశారు. 19,765 ఎకరాల్లో సన్న రకం వరి, 1,921 ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో దిగుబడి ఆశాజనకంగానే ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తోందని అంటున్నారు.

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



మండల వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే వరికోతలు ప్రారంభమవుతున్నాయి. వారం రోజుల్లోపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. గత సీజన్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాలతో పాటు మరో నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

– వి.అంజనేయులు, తహసీల్దార్, మునగాల

వ్యాపారులకు విక్రయించా



నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. వారం రోజుల క్రితం పంట కోశా. 84 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులకు విక్రయించా. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, బోనస్ అందకుండా పోయింది.

– బొబ్బిలి వెంకటరెడ్డి, రైతు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నేను 25 ఎకరాల వరి సాగు చేశా. మూడు రోజుల క్రితం వరి పంట కోశాం. కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యాన్ని ఆరబెట్టాను. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అందే అవకాశం ఉంటుంది.

– తూముల వీరస్వామి, రైతు, మునగాల

సమస్యల పరిష్కారానికి పాటుపడతా



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పి. శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఎం.అంజయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సాధించి, పదోన్నతులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు టి. జితేందర్‌రెడ్డి, టి. నరేష్, బి .కోటయ్య, పి. వీరబాబు, కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, దయాకర్, సైదులు, సందీప్ పాల్గొన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ

చిలుకూరు : రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు కోరారు. బుధవారం చిలుకూరు మండలంలోని నారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ గంద్ర పూర్ణయ్య, డైరెక్టర్లు దేశబోయిన మట్టయ్య, గంద్రా ముత్తయ్య, దేశబోయిన నాగరాజు, ఏసు, కాటూరి ఏసు, రాంబాబు, నాగేశ్వరరావు, హోలియా, మణెమ్మ, బుచ్చమ్మ, గోపయ్య, మాజీ సర్పంచ్‌లు మండవ వెంకటేశ్వర్లు, జానిమియా, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి

గరిడేపల్లి : సహకార సంఘం బలోపేతానికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ నిడిగొండ కనకయ్య, డైరెక్టర్లు చనగాని సాంబయ్య, బాల్లురి అంజయ్య, సిబ్బంది దొంగరి శ్రీనివాస్, పాలెల్లి అంజయ్య, నకిరేకంటి సాయిలు, హరీష్, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవులకు తీరని లోటు



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కోదాడరూరల్ : పాస్టర్ పగడాల ప్రవీణ్ అకాల మృతి క్రైస్తవులకు తీరని లోటని పాస్టర్స్ ఫెలోషిప్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన కొవ్వొత్తుల ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ నగరం కేంద్రంగా చేసుకొని ప్రపంచ వ్యాప్తంగా సువార్తకుడిగా పని చేస్తున్న పగడాల ప్రవీణ్ ఈ నెల 25న రాజమండ్రి సమీపంలో మరణించడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఆయనను దుండగులు హత్య చేసినట్లు ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం తక్షణమే పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.జోసెఫ్, జిల్లా క్రైస్తవ మీడియా కన్వీనర్ జెజె శామ్యూల్‌సన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు పంది తిరపయ్య, గుండెపంగు రమేష్, పాల్ చారి, షేక్.కొర్నేలి బాబు, రాము జెకర్యా, రామారావు, దానియేలు, శామ్యూల్ పీటర్, సైమన్, రాజేష్, ఆమోసు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మేళ్లచెరువు: మండల కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్త, కుమారుడు బైక్‌పై కోదాడకు వెళ్లి తిరిగి వస్తుండగా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని హేమ్లాతండా క్రాస్ రోడ్డు వద్ద వేబ్రిడ్జిలోకి డీసీఎం మలుపు తిరిగే సమయంలో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి, కొడుకుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా సాయంత్రం ఆరు గంటల సమయంలో మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని వెల్లటూరు క్రాస్‌రోడ్డు వద్ద వెల్లటూరు గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు రోడ్డు దాటుతుండగా కోదాడ వైపు వెళుతున్న కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ తలకు గాయం కాగా ఆమెను చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. మరో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు



నడిగూడెంలో భోజనం వడ్డిస్తున్న వేలాద్రి



మునగాలలో..

మునగాల : మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ వైద్యుడు అంతోటి చంద్రమౌళి బుధవారం రాత్రి రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పలువురు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కులమతాలకు అతీతంగా ప్రతియేటా తాను ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటేశ్వరరావు, గంధం సైదులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌పద్మావతి యువసేన ఆధ్వర్యంలో..

నడిగూడెం : రంజాన్ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని కేకే ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు బుధవారం ఉత్తమ్ పద్మావతి యువసేన ఆధ్వర్యంలో ఆ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మునగాలకు చెందిన తొగాటి వేలాద్రి, హైమావతి దంపతుల సహకారంతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేలాద్రిని సన్మానించారు. కార్యక్రమంలో ముస్లింపెద్దలు ఎండి.అఫ్జల్, జానిమియా, నజీరుద్దీన్, ముజీబూర్ రెహ్మాన్, కాశీం, గౌస్, మస్తాన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న మశ్రం శ్రీనివాస్ రంజాన్ మాసం సందర్భంగా బుధవారం తనతో పాటు పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎండి సలీం షరీఫ్, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఎండి.ఖలీల్ అహ్మద్, ఎండి.జానిమియా, శోభన్‌బాబు, ఎండి.మౌలానా, శ్రీదేవి, అశోక్. వీఎల్‌ఎస్ చారి, కత్తి వెంకటేశ్వర్లు, అహల్యదేవి, పర్వతాలు, బి.వెంకటేశ్వర్లు, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్‌గా సైదయ్యగౌడ్



గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సైదయ్యగౌడ్

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్ ఉత్తమ మోటివేషనల్ స్పీకర్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. ప్రముఖ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ట్రెన్ ది ట్రైనర్'పేరుతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో శిక్షణ పొందిన ఆయన ఈనెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నట్లు బుధవారం మోడల్ స్కూల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు.

హైవోల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18 వార్డుల్లో మంగళవారం అర్ధరాత్రి హైవోల్టేజీ కారణంగా పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. మంగళవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ సరఫరా పెరిగి పలువురి ఇళ్లలో టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ ఏఈ రాంప్రసాద్‌ను సంప్రదించగా.. హైవోల్టేజీతో కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మార్చి విద్యుత్ అంతరాయం లేకుండా చేశామని చెప్పారు. గృహోపకరణాలు కాలిన విషయం తమకు ఎవరూ తెలియజేయలేదని పేర్కొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ

మునగాల : మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్, మండల స్థాయి అధికారులు తనిఖీ చేశారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 309 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించిన వారిలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- కూలీకి తీవ్ర గాయాలు

మఠంపల్లి: కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. మఠంపల్లి మండలం రఘునాథపాలెం సమీపంలో బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో మహిళా కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. మఠంపల్లి ఎస్‌ఐ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన కూలీలు ఆటోలో చింతలపాలెం మండలంలో మిర్చి తోటల్లో మిరపకాయలు ఏరేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో మఠంపల్లి మండలం రఘునాథపాలెం సమీపంలో మసీదు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు డ్రైవర్ పక్కన కూర్చున్న మహిళా కూలీ మానస కాలు విరిగింది. మిగతా వారికి ఎటువంటి గాయాలు కాలేదు. క్షతగాత్రురాలిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మానస బంధువు దైదారాయలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



సిరికొండ రోడ్డును ఇరువైపులా కమ్మేసిన కంప చెట్లు

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో నాగుల చెర్వు కట్ట రోడ్డును ఇరువైపులా కంప చెట్లు కమ్మేశాయి. దీంతో మూలమలుపులో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సిరికొండ గ్రామం నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. అనునిత్యం ఈ మార్గం గుండా వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట కంపచెట్లు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముస్లింలకు తోఫాలు అందజేసిన ఘనత కేసీఆర్‌దే

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ముస్లింలకు ఖర్జూరా తినిపిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, నాయకులు

నేరేడుచర్ల : దేశంలో ప్రప్రథమంగా రంజాన్ పండగకు ముస్లింలకు తోఫాలు అందజేసిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా బుధవారం రాత్రి నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల మసీదులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ అన్ని పండుగలకు సమ ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. తెలంగాణలో గంగ జమున తెహజీబ్‌లా ఒకరి పండుగను ఒకరు గౌరవించే విధానం రావాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీలోని మైనార్టీల సంక్షేమం కోసం రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ, బీఆర్‌ఎస్ నాయకులు ఇబ్రహీం, ఖాదర్, షోయబ్, హుస్సేన్, జానీ, ఖాజా, బషీర్, అరిబండి సురేష్, దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, లకుమళ్ల జ్యోతి, సైదులు, నాగరాజు, చందమళ్ల జయబాబు, సైదిరెడ్డి, కడియం వెంకటరెడ్డి, మార్కండేయ, పిచ్చిరెడ్డి, నవీన్‌కుమార్, శ్రీను, సుదర్శన్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

బొమ్మగాని ధర్మభిక్షంకు నివాళి



హుజూర్‌నగర్ : ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్



హుజూర్‌నగర్ : ఇందిరా భవన్‌లో..

హుజూర్‌నగర్ : పేద ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చితపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు దొంతగాని సత్యనారాయణ, యల్లావుల రమేష్, జడ వెంకన్న, మామిడి వెంకయ్య, చక్రాల వెంకన్న, బత్తిని నాగరాజు, లింగయ్య, ప్రసాద్, మంగయ్య, వెంకటేశ్వర్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా భవన్‌లో..

మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని బుధవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో కల్లుగీత కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బెల్లంకొండ గురువయ్య, వల్లపుదాసు కృష్ణ, పి.లాలు, పి.హుస్సేన్, సైదులు, జగన్, అర్జున్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

చింతలపాలెంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు గుండు వెంకటేశ్వర్లు, శ్రీను, గోనె అంకయ్య, హైమావతి, చిన్న కొండారెడ్డి, కోటియా, వెంకటేశ్వర్లు, మగ్దుంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి

నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లాకు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం నేరేడుచర్లలో ధర్మభిక్షం 14వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, బీఆర్‌ఎస్ నేత రాపోలు నవీన్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, గీత పనివారల సంఘం నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణ, చామకూరి వీరయ్యగౌడ్, ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవింద్, కొమ్రరాజు వెంకట్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఉదయ్, శేఖర్, బి.శ్రీనివాస్, జగతయ్య తదితరులున్నారు.



నేరేడుచర్లలో..

ఎస్‌ఏ పోస్టులను బీఈడీ అభ్యర్థులతో భర్తీ చేయాలి



బాపూజీ గ్రంథాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఈడీ అభ్యర్థులు

కోదాడరూరల్ : స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని బీఈడీ అభ్యర్థుల నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీనాయక్ కోరారు. ఎస్‌ఏల పదోన్నతులకు వ్యతిరేకంగా బుధవారం పట్టణంలోని బాపూజీ గ్రంథాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఎస్జీటీలకు 70 శాతం మేర పదోన్నతులు కల్పించడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పోటీ పడే బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలో ఉన్నట్లుగా తెలంగాణలో కూడా 70 శాతం స్కూల్ అసిస్టెంట్లను బీఈడీ అభ్యర్థులతో భర్తీ చేయాలని, 30 శాతం పోస్టులకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శ్రీను, సందీప్, నరేష్, శోభ, సారిక, సుమ, తులసి, రమేష్, శ్రీరాములు, శ్రీకాంత్, రామారావు, ఉపేందర్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని ముకుందాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ల మరమ్మతులు చేపడుతున్నందున గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దోరకుంట, కొమరబండలో..

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంట విలేజ్ ఫీడర్, కొమరబండ పరిధిలో ఇండస్ట్రీయల్, విలేజ్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆ రెండు గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ సైదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజ సేవలో వాసవీ క్లబ్ ముందంజ

కోదాడ : సేవా కార్యక్రమాలు చేపట్టడంలో వాసవీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు శేకు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోదాడ వాసవీ క్లబ్ విజయం ఆధ్వర్యంలో వైశ్య సామాజిక వర్గానికి చెందిన కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జల్లా జనార్దన్‌రావు, పైడిమర్రి రామారావు, శారద, ఓరుగంటి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, రంగా కోటి, ఉప్పలరామ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ దాసరి సంజీవయ్య తెలిపారు. బుధవారం మండలంలోని బృందావనపురంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉంటున్నందున కూలీలు పనులకు త్వరగా రావాలన్నారు. ఆయన వెంట టీఏ సతీష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పేదలు సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి : పేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కల నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని యాతవాకిళ్లకు చెందిన సూర్యంకు మంజూరైన రూ.36 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. అదేవిధంగా గ్రామానికి చెందిన దైదా సైదులుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డంపెదవీరయ్య, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, దేవభిక్షం, సైదులు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో పోతబత్తిని సుజానమ్మకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పారుపల్లి చంద్రశేఖర్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

హుజూర్‌నగర్‌రూరల్ : కోదాడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈనెల 28వ తేదీన నిర్వహించబోయే క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియ, సీహెచ్‌ఓ పద్మ, ఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిస కావొద్దు

మునగాల : యువత, విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిస కావొద్దని బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం మునగాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే భ్రమలో యువత పక్కదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు.బీసీ యువజన సంఘం నాయకులు ప్రణయ్, బాలు, సురేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

మునగాల : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పోరాట స్ఫూర్తితో నేటి యువత ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధారవత్ రవి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం రాత్రి మండలంలోని కొక్కిరేణిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి కామళ్ల ఉదయ్, పీవైఎల్ జిల్లా నాయకులు పొన్నం బ్రహ్మం, పీడీఎస్‌యూ నాయకులు చరణ్, హరి, మురళి, కృష్ణ, సిద్దు, లోకేష్, విష్ణేష్, రాజు, వినయ్ పాల్గొన్నారు.